# కీలుగుర్రం



శివరాత్రి వెళ్ళిన రెండోరోజు.

ఆ రోజు కీలుగుర్రం ఉత్సవం. నిన్న స్వామి సపరివారంగా పెద్ద రథం మీద ఊరేగటం చూసిన చాలామంది జనం ఇవ్వాళ కీలుగుర్రం ఉత్సవం చూడ్డానికి ఉండిపోయారు. కీలుగుర్రానికి రంగులు వేశారు. మూడడుగుల ఎత్తున బల్ల, ఆ బల్లమీద ఆరడుగులెత్తున గుర్రం. తెల్లగా దేవతాశ్వంలా మెరిసిపోతోంది. నల్లటి జూలు. ఠీవిగా మోరెత్తుకుని మునుగాళ్ళు ఎత్తి పరుగుతీస్తున్నట్లుంది

కీలుగుర్రం. మెళ్లో చిరుమువ్వలు గాలికి మోగుతున్నాయి. జీనుకు కట్టిన రంగురంగుల గుడ్డలు గాలిలో రెపరెపలాడుతుంటే స్వామిని మూపున ఎక్కించుకుని మేఘాల్లో తేలిపోవటానికి సిద్ధంగా ఉంది కీలుగుర్రం.

అయ్యవారి విగ్రహానికి ఉదయం నుంచి అర్చకులు అలంకారాలు చేస్తున్నారు. ఐదగుడుల ఎత్తున్న కంచు విగ్రహం అయ్యవారి విగ్రహం. బంగారు రంగులో మెరిసిపోతున్నాడు స్వామి. పట్టు అంగరఖా బిగింపుగా స్వామి విగ్రహాన్ని అంటిపెట్టుకుని ఉంది. జలతారు ఉత్తరీయం బంగారు పాదాలకు ఆభరణాలు, విశాలమైన వక్షస్థలంపైన కదలాడుతున్న ముత్యాలపేరులు, ఆ ముత్యాలపేరుల మధ్య మెరుస్తున్న చింతాకు పతకం. స్వామి నుదుట కస్తూరితిలకం దిద్దారు. శిరస్సున కిరీటం ధగధగలాడుతోంది. ఆ కిరీటానికి కలికితురాయి. చేత ఝుళిపిస్తున్న చెమ్కీ కర్ర.

నిన్నగాక మొన్ననేగదా స్వామి కళ్యాణం జరిగింది. నుదుట బాసికపు అర ఇంకా అలాగే ఉంది. ముంజేతి పసుపుకంకణం పచ్చగా ఉంది. స్వామి ముఖంమీద చిరునవ్వు పెదవుల కొసదాకా పాకుతోంది. ముఖమంతా నవ్వు కమ్ముకుంటోంది.

ఆ నవ్వుతో మంటపమంతా వెలిగిపోతోంది. అర్చకులు స్వామి విగ్రహాన్ని మళ్లీ మళ్ళీ అలంకరించి చూసుకుంటున్నారు. ఉచ్చైశ్రవం మీద విశ్వవిహారం చేయడానికి అలా సన్నద్ధుడయ్యాడు స్వామి.

కీలుగుర్రం ఉత్సవం పూర్తయి అయ్యవారి విగ్రహం తిరిగి గుళ్ళోకి చేరేదాకా అర్చకులు బిక్కుబిక్కుమంటూ ఉంటారు. అన్ని సేవలూ ఒక ఎత్తు. కీలుగుర్రం సేవ ఒకెత్తు. ఐదడుగుల కంచువిగ్రహం అయ్యవారి విగ్రహం. మామూలుగా

విగ్రహాన్ని వాహనందాకా తీసికెళ్ళటానికి విగ్రహం బుజాల వెనక ఒక చేవకర్ర కట్టి బిగిస్తారు. ఇద్దరు బలమైన వాళ్ళు ఆ కర్రసాయంతో విగ్రహాన్ని బుజాలకెత్తుకుని పీఠాన్ని చేతుల్తో పట్టుకుని, వాహనం దగ్గరకు తీసుకొస్తారు. మూడు ప్రాకారాలు వూరేగించి తీసుకురావాలి కాబట్టి, ఆ ఇద్దరూ మధ్యలో అలిసిపోతే ఇంకో ఇద్దరు పక్కనే ఉంటూ విగ్రహాన్ని ఎత్తుకుంటారు. అయితే కీలుగుర్రం సేవ నలుగురితో అయ్యేది కాదు. అయిదడుగుల అయ్యవారి విగ్రహం ఆరడుగుల గుర్రం మీది కెక్కించాలి. అంచేత విగ్రహానికి పైన కాకుండా పీఠరి దగ్గర కూడా మరో చేవకర్ర బిగించి కట్టారు.

సాయంత్రం అయింది. కీలుగుర్రం సేవకు సన్నాహాలు పూర్తయ్యాయి. మషాలీలు కాగడాలు వెలిగించారు. వందిమాగధులు "హరహర మహాదేవ" అన్నారు. మంగళ వాద్యాలతో స్వామి వూరేగింపుగా వస్తున్నాడు. స్వామి విగ్రహాన్ని ఏటవాలుగా వాల్చి పైన ఇద్దరు, కింద ఇద్దరు కర్రల సాయంతో మోస్తున్నారు. ఈ నలుగురు ఒకే వేగంతో అడుగులు వేస్తున్నారు లేకపోతే అడుగు తడబడితే నడక సాగదు. విగ్రహం ముందుకు వెళ్ళదు. అడుగు క్రమంగా లేకపోతే పదునైన విగ్రహపీఠం కొసలు విగ్రహం మోసేవాళ్ళ కాళ్ళు కోసేస్తాయి. ఈ పట్టుకున్న నలుగురూ అలిసిపోయినప్పుడు ఆదుకోటానికి మరో నలుగురు విగ్రహం వెంట సిద్ధంగా నడుస్తున్నారు. ఈ నలుగురూ విగ్రహాన్ని తీసుకొస్తున్నా విగ్రహానికి ముందు ఒక మనిషి చిన్న బల్లతో వెనక్కి వెనక్కి నడుస్తూ విగ్రహాన్ని గమనిస్తూ వస్తున్నాడు. విగ్రహం మోస్తున్నవాళ్ళు 'బల్ల వెయ్యి' అనగానే అతను బల్లవేస్తే విగ్రహాన్ని ఆ బల్లమీద నుంచోపెట్టి వాళ్ళు ఓ క్షణం అలుపు తీర్చుకొని, తిరగి నడుముకున్న ఉత్తరీయాలు బిగించుకుని వూరేగింపు కొనసాగిస్తున్నారు.

ఇలా అర్చకుల గుండెలు గుబ గుబ లాడుతుండగా అయ్యవారి విగ్రహాన్ని

కీలుగుర్రం దగ్గరకు తీసుకొచ్చారు. ముందు బల్లమీద వేంచేపు చేశారు. ఆపైన గుర్రం మీదికి ఇద్దరు ఎక్కి, గుర్రాన్ని వెనక్కువంచి వీపుమీద బల్లవేసి విగ్రహాన్ని కిందనుంచి నలుగురు ఎత్తగా స్వామిని గుర్రం వీపుమీదికి చేర్చారు. అక్కడనుంచి విగ్రహాన్ని గుర్రం మూపు మీదికి చేర్చి స్వామి అలంకారాలు సరిదిద్ది అర్చకులు 'అమ్మయ్య' అనుకున్నారు. కీలుగుర్రం మీద ఆనవాయితీగా ఎక్కే అర్చకుడు సూరయ్యగారు స్వామికి హారతిచ్చి "ఇంకేవిటి ఆలస్యం?" అన్నారు. కాని విగ్రహం మోసేవాళ్ళు అందరూ రాలేదు. మనిషి నీద మనిషి వెళ్ళాడు, కొందరొచ్చారు, కొందరు రాలేదు. అందులో కొందరు తాగి వచ్చారు. వచ్చిన వాళ్ళు పాత తగాదాలతో తిట్టుకోడం మొదలెట్టారు. "వోరి మీ దుంపతెగా! ముందు వూరేగింపు లేవతీయండ్రా" అన్నారు పెద్దలు.

పట్టండంటే పట్టండన్నారు. కీలుగుర్రం లేవలేదు. వెనకవాళ్ళు ముందుకి ముందువాళ్ళు వెనక్కి మారారు. నీది తప్పంటే నీది తప్పనుకున్నారు. అమ్మలక్కలు తిట్టుకున్నారు. పోటీ కర్రల్తో ఎగబడ్డారు. జనం అడ్డుకుని ఆపి కేకలేసి 'ఊరేగింపు సాగాల'న్నారు.

పట్టు! పట్టు!

కీలుగుర్రం లేవలేదు.

మోస్తున్న వాళ్ళలో ఎవడో అన్నాడు "వాహనం మీద ఎక్కిన అర్చకుడు సూరయ్యగారే గదా! అయన వేరుశనక్కాయల ఫ్యాక్టరీలో పనిచేస్తాడు గదా! అక్కడ బూబుతో మైలపడొచ్చుంటాడు. అందుకే వాహనం లేవటం లేదు.

ఆపైన "హర హర మహాదేవ" జనం కేకలు - కీలుగుర్రం వాహనం ముందుకు సాగిపోయింది. ✻